క్లుప్తంగా

విద్యార్థుల మానసికోల్లాసానికి ప్రత్యేక శిబిరం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

సుల్తానాబాద్‌రూరల్: గురుకుల విద్యార్థినులకు వేసవి సెలవుల్లో మానసిక ఉల్లాసాన్ని ఇచ్చే విధంగా ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణశ్రీ తెలిపారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల(బాలికల)లో శనివారం గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే విధంగా శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచాలి



టాయ్‌లెట్లు పరిశీలిస్తున్న కమిషనర్

సుల్తానాబాద్: పబ్లిక్ టాయిలెట్లను నిర్వాహకులు పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ అన్నారు. శనివారం సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రీనగర్ , సుగ్లాంపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో, అంబేడ్కర్ చౌరస్తా వద్ద పబ్లిక్ టాయిలెట్లను కమిషనర్ పరిశీలించి మాట్లాడారు. టాయిలెట్లను ప్రజలు ఉపయోగించుకునేలా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. చెత్తను ఇష్టానుసారంగా పారవేయకుండా మున్సిపల్ ట్రాలీ వచ్చినప్పుడు అందజేయాలని సూచించారు.

సర్పంచ్, కార్యదర్శికి ఘన స్వాగతం



సర్పంచ్, కార్యదర్శిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామం క్లీన్ అండ్ గ్రీన్‌లో జాతీయ స్థాయిలో 3వ స్థానం పొంది, ఈనెల 17న ఢిల్లీలో రాష్ట్రపతి, కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుని గ్రామానికి విచ్చేసిన సర్పంచ్ అర్షనపల్లి వేంకటేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి వినోద్‌కృష్ణకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.డీజే సౌండ్‌తో నృత్యాలు చేస్తూ టపాసులు పేల్చి ర్యాలీగా జీపీ కార్యాలయం వరకు చేరుకున్నారు. అనంతరం సర్పంచ్, కార్యదర్శిని ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ హరీశ్ గౌడ్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రంతో దాహార్తి తీర్చడం అభినందనీయం

కమాన్‌పూర్: అంబలి, చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర నాయకులు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అంబలి కేంద్రాన్ని శనివారం పరిశీలించి అంబలి పంపిణీ చేశారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జంగపెల్లి అజయ్, పార్టీ నాయకులు కొమ్ము శ్రీనివాస్, మల్లారపు అరుణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం

ధర్మారం: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం మండల కేంద్రంలోని బ్రిలియంట్ మోడల్ కిడ్జ్ స్కూల్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా కొత్త మోహన్, కోరుకంటి స్వామి, గెల్లి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా మామిడిశెట్టి శ్రీనివాస్, ఇరుకుల్లా సంతోష్,, బంద్రా గంగాధర్, కోశాధికారిగా ఎలిగేటి మహేందర్, జైన చంద్రమౌళి, రేణిగుంట సతీష్, బీరెల్లి రవీందర్, అమ్ముల నరేష్, జోన్ చైర్మన్‌గా సురేందర్, వైస్ ప్రెసిడెంట్‌గా గడ్డం శ్రీనివాస్, తోడేటి మురళి, తాళ్ళ సతీష్, కందుల సతీష్, ఎండీ అజాంబాబా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జాయింట్ ట్రెజర్ ఆఫ్ సౌత్ మల్టీపుల్ కౌన్సిల్ అండ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, గాలిపెల్లి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కమాన్‌పూర్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఈద్గాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్



కదంబాపూర్‌లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



మంథనిలో శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్

ఈద్‌ముబారక్..

రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు జిల్లా వ్యాప్తంగా ఈద్గాల వద్ద శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు అలయ్...బలయ్ తీసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, శ్రీధర్ బాబు, జెడ్పీ చైర్మన్ పుట్టమధు, ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రార్థనల అనంతరం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి, నెట్‌వర్క్

సమ్మర్ టేస్టీ.. తాటి ముంజలు

- వేసవి తాపాన్ని తీర్చే తాటి ముంజలు
- సమ్మర్‌లోనే లభించే ఆరోగ్య తాటి ఫలం
- క్యాన్సర్ ముప్పునకు చెక్
- ఆరోగ్యానికి మేలు చేస్తాయంటున్న వైద్య నిపుణులు

సండే స్పెషల్



నోరూరిస్తున్న తాటి ముంజలు



కోల్‌సిటీ: తాటి ముంజలు.. ఇవి ప్రకృతి వరప్రసాదం. వీటిని ఐస్ ఆపిల్స్‌గా పిలుస్తారు. ఇప్పుడు తాటి ముంజల సీజన్ నడుస్తోంది. జిల్లాలో ఎక్కడ చూసినా తాటి ముంజలే కనిపిస్తున్నాయి. వేసవిలో మాత్రమే దొరికే ఈ తాటి ముంజలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఎండాకాలంలో శరీరానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. అందుకే ప్రతి ఒక్కరూ ఈ సమ్మర్ సీజన్‌లో తాటి ముంజలను టేస్ట్ చేస్తున్నారు. వేసవిలో మాత్రమే లభించే ముఖ్యమైన పండ్లల్లో తాటి ముంజలు కూడా ఒకటి. తియ్యగా... నోట్లో వేసుకుంటే కరిగిపోతాయి. ఆరు అరటిపండ్లలో ఉండే పొటాషియం ఒక్క తాటి ముంజలో ఉంటుందంటే.. తాటి ముంజ ప్రత్యేకత ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

సమ్మర్ సీజన్..

సమ్మర్‌లో మాత్రమే లభించే ఈ తాటి ముంజల రుచి చూసేందుకు జిల్లా ప్రజలు ఇష్టపడుతున్నారు. రూ.100 లకు ఐదు ముంజకాయలు చొప్పున విక్రయిస్తున్నారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో తాటి ముంజలను రోడ్ల పక్కన నీడనిచ్చే చెట్ల కింద విక్రయిస్తున్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో సమీప ప్రాంతాల రైతులు, చిరు వ్యాపారస్తులు తాటి ముంజలను విక్రయిస్తున్నారు.

ఆరోగ్యానికి ముంజ ఫలం..

- ముంజల్లో విటమిన్– ఏ, బీ, సీ, ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం, కాల్షియం, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.
- వేసవిలో వీటిని అధికంగా తినడం వల్ల ఆరోగ్యానికి శ్రేయస్కరమని వైద్యులు చెబుతున్నారు. డీహైడ్రేషన్‌కు చెక్ పెట్టవచ్చంటున్నారు.
- ప్రెగ్నెన్సీ సమయంలో కొంతమందికి ఏది తిన్నా జీర్ణం కాకపోవడం లాంటి సమస్య ఎదురవుతుంది. అలాంటి వారు ముంజల్ని తింటే జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యల్ని కూడా దూరం చేస్తాయి.
- వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేసే ఫైటోకెమికల్స్, ఆంథోసయనిన్ లాంటి వాటిని నిర్మూలిస్తాయి. ముంజకాయలను ఎక్కువగా తినడం వల్ల క్యాన్సర్ల నుంచి కూడా దూరంగా ఉండొచ్చు.
- శరీరంలో గ్లూకోజ్ స్థాయిని పెంచి.. శరీరానికి కావాల్సిన మినరల్స్, న్యూట్రియంట్ల శాతాన్ని బ్యాలెన్స్ చేయడంలో కూడా ముంజలు కీలక పాత్ర పోషిస్తాయి.
- చాలామంది ముంజల పైన పొట్టు లాగా ఉండే పైపొర తీసేసి తింటారు. కానీ ఆ పొట్టులోనే ఎన్నో రకాల పోషకాలుంటాయని, ఈ పొట్టు వల్లే శరీరానికి ఎక్కువ చలువ చేస్తుంది. తాటి ముంజల్ని పొట్టు తీయకుండా తింటేనే ఆరోగ్యానికి మంచిదని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

ప్రతి ఎండాకాలంలో అమ్ముతా..



ప్రతి ఎండాకాలంలో ముంజకాయలను చెట్ల కింద పెట్టుకుని అమ్ముతున్న. చుట్టుపక్కన గ్రామాల్లోని తాటి చెట్ల నుంచి ముంజు లను కొనుక్కొచ్చి, గోదావరిఖనిలో అ మ్ముతున్న. ఆరోగ్యానికి ముంజలు చాలా మంచివి. ఎండలు బాగా ముదురుతున్నాయ్. ఈ కాలం పిల్లలు, పెద్దలు సమ్మర్ సీజన్‌లో ముంజలను ఎక్కువగా తినాలి.

– ఆనంద్, చిరువ్యాపారి,గోదావరిఖని

తాటి ముంజల్లో పోషకాలు..



తాటి ముంజల్లో చాలా పోషకాలున్నాయి. సమ్మర్‌లో దొరికే పండ్లల్లో తాటి ముంజలు ముఖ్యమైనవి. వీటిలో విటమిన్–ఏ, బీ, సీ, ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం , కాల్షియం, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఈ సమ్మర్‌లో తాటి ముంజలు తినడం మిస్సయితే.. మళ్లీ వచ్చే ఎండాకాలం వరకు ఆగాల్సిందే. పోషకాలు కలిగిన కల్తీలేని ఆరోగ్యకరమైన ప్రకృతి పండును అందరూ తినాలి.

– డాక్టర్ అప్పారావు, రామగుండం జీజీహెచ్ ఆర్ఎంవో

చలో పెద్దపల్లి పోస్టర్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మారం: మాలల హక్కుల సాధనకు ఈ నెల 23న చేపట్టిన చలో పెద్దపల్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. శనివారం ధర్మారంలో పోస్టర్ విడుదల చేశారు. పెద్దపల్లి పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న సమావేశానికి ప్రతి గ్రామం నుంచి మాల సోదరులు అధిక సంఖ్యలో తరలిరావాలని సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు రాములు కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి నళినికాంత్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భరత స్వామి, ఎంపీటీసీ సూరమల్ల శ్రీనివాస్, నాయకులు దేవి రాజలింగయ్య, రాజేందర్, వంశీ, దేవి లావణ్య, రాజారాం, పానుగంటి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం సుద్దాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్ కాసర్ల అంజలి, ఎంపీటీసీ నిర్మల, ఎస్ఎంసీ చైర్మన్ బోంకూరి ఐలయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ఓదెల: రైతులు ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తి, ఓదెల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యంను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. రైతులకు అండగా కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతుధర కల్పిస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఆకుల మహేందర్, కోట దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీపీ కునారపు రేణుకదేవి, పొత్కపల్లి సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కావటి రాజు, ఏపీఎం లతా మంగేశ్వరీ, ఎంపీటీసీలు ఆరెళ్లి సరోజన,చిన్నస్వామి నాయకులు పాల్గొన్నారు.



కనగర్తిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలు, గ్రామాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు శనివారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పంటకు గిట్టుబాటు ధర

మంథని: రైతు కష్టం తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు.శనివారం మంథని వ్యవసాయ మార్కెట్ యార్డు, మండలంలోని పోతారంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగలా చేశారన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పుట్ట మధు

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్

జూలపల్లి: బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా పనిచేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ అన్నారు. మండలంలోని కుమ్మరికుంటలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేశ్, సర్పంచులు సంతోశ్‌రావు, నర్సింహయాదవ్,ఎంపీటీసీలు మల్లేశ్‌యాదవ్, దండె వెంకటేశం, శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్త శ్రీధర్, నాయకులు కంది చొక్కారెడ్డి, కుంట రాజేశ్వర్‌రెడ్డి, ముత్తులింగం, కాంతయ్య, కామరాజు,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘువీర్‌సింగ్

గ్రామ దేవతల మారు కొలుపు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని అంకంపల్లిలో గ్రామదేవతలకు శనివారం ఊరు కొలుపు నిర్వహించారు. 101 కలశాలతో నీటిని తీసుకువెళ్లి గ్రామ దేవతలకు అభిషేకం చేశారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో గ్రామం పచ్చదనంతో ఉండాలని గ్రామ దేవతలను వేడుకున్నారు. బీసీ సంఘాల నాయకుడు స్వామి వివేక్‌పటేల్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిరంజీవి, ఎంపీటీసీ పెండ్లి సంపత్, మాజీ సర్పంచులు, ఐలక్క, మల్లన్న, సంజీవ్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థినికి జీఎం అభినందన

కమాన్‌పూర్: సింగరేణి సంస్థ ఓసీపీ–1లో విధులు నిర్వహిస్తున్న చల్లా నరసింహారెడ్డి కుమార్తె నర్మదాదేవి సీఏ పూర్తి చేసిన సందర్భంగా శనివారం తన కార్యాలయంలో జీఎం వెంకటేశ్వర్‌రావు అభినందించారు. ఐదేండ్ల కాలంలోనే బీకాంతో పాటు సీఏ పూర్తి చేసి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం సాధించడం అభినందనీయమని, సింగరేణి ఉద్యోగుల పిల్లలు నర్మదాదేవిని ఆదర్శంగా తీసుకోవాలని జీఎం అన్నారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు ఏలిషా, శ్రీనివాసులు, టీబీజీకేఎస్ నాయకులు గౌతం శంకరయ్య, దామోదర్, మారుతి, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, వినయ్ ఉన్నారు.

పెన్షన్ కార్డులు అందజేత

గోదావరిఖనిటౌన్: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న ముస్లింలకు రంజాన్ సందర్భంగా శనివారం నీడ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు పల్లెర్ల రమేశ్ గౌడ్ నీడ ఆరోగ్యమస్తు పెన్షన్ పేరుతో కార్డులను ప్రతినెల రూ.521 ఇస్తున్నట్లు తెలిపారు. కాకతీయనగర్‌కు చెందిన ముస్లిం మహిళ ఎండీ ఫాతిమాబేగంకు, శివాజీ నగర్‌కు చెందిన ఎండీ దస్తగిరికి, బీఆర్ఎస్ నాయకులు పాతిపల్లి ఎల్లయ్య, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి పూదరి కుమార్ చేతుల మీదుగా నీడ ఆరోగ్యమస్తు పెన్షన్ కార్డులు, నగదు అందజేశారు.

కేబుల్ ప్రసారాల ధరలను తగ్గించాలి

రామగుండం: ఎస్ఎస్‌సీ కేబుల్ యాజమాన్యం ఇటీవల పెంచిన ప్రసార ధరలను వెంటనే తగ్గించాలని, పాత ధరలకే వినోదం అందించాలని ఉమ్మడి రామగుండం కేబుల్ ఆపరేటర్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలో ఆపరేటర్ల సమావేశం ఏర్పాటు చేసి సిటీ కేబుల్ ఎండీ ఇంజపురి పులేందర్‌కు లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు. ఎస్ఎస్‌సీ యాజమాన్యం టీవీ రీఛార్జ్ పెంచిన ధరలతో కేబుల్ ఆపరేటర్లకు నష్టం కలిగించే పరిస్థితి ఉందని, ప్రజలకు నాణ్యమైన ప్రసారాలను తక్కువ ధరలకు అందించే వినోదంపై ఆర్థికభారం మోపే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటలైజేషన్ మూలంగా పెరిగిన ధరలు, కరోనా ప్రభావం, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యలో 50శాతం మాత్రమే రీఛార్జ్ చేసుకుంటున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో రీఛార్జ్ ధరలను పెంచితే సాధారణ ప్రజలు డిష్ రీఛార్జ్ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో ఆపరేటర్ల నిర్వహణ భారం పెరిగి తీవ్రంగా నష్టపోతారన్నారు. సిటీకేబుల్ యాజమాన్యం స్పందించి పెంచిన ప్రసార ధరలను సత్వరమే తగ్గించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి రామగుండం మండల ఆపరేటర్లు హాజరయ్యారు.

నేడు రాష్ట్ర బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం

కమాన్‌పూర్: రామగిరి మండలం సెంటినరీకాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్లో ఆదివారం తెలంగాణ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంతో పాటు రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఓసీపీ–1 భద్రకాళి ఆలయ అర్చకులు విజయసారథి తెలిపారు.

నేటి నుంచి తిరుక్కల్యాణ మహోత్సవాలు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి తిరుక్కల్యాణ మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. 23 నుంచి మే 7వ తేదీ రథోత్సవం, జాతరతో ఉత్సవాలు ముగియనున్నాయి. 14రోజులు పాటు జరిగే కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు, వెంకట్రామ్‌రెడ్డి, తెలిపారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి, వెన్నంపల్లి, మొట్లపల్లి, చిన్నరాతుపల్లి, పెద్దరాతుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నేడు ప్రారంభించనునట్లు ఐకేపీ ఏపీఎం సదానందం, పీఏసీఎస్ చైర్మన్లు చదువు రాంచంద్రా రెడ్డి, గజవెల్లి పురుషోత్తం తెలిపారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేణుకాఎల్లమ్మ కొలుపు ఉత్సవాలు ప్రారంభం

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని లద్నాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం రేణుకా ఎల్లమ్మ కొలుపు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం వరకు జరిగే ఉత్సవాల్లో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

24న ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం

కోల్‌సిటీ: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు (సీఎస్‌సీ) ఆధ్వర్యంలో గంగానగర్ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్‌స్ట్రక్షన్స్ (ఎన్ఏసీ) భవన ప్రాంగణంలో ఈనెల 24వ తేదీ నుండి 20 రోజుల పాటు 'ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం' నిర్వహించనున్నట్లు మేయర్ బంగి అనిల్ కుమార్, కమిషనర్ సుమన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. లేబర్ కార్డున్న భవన నిర్మాణ కార్మికులు, ఇతర కార్మికులకు దాదాపు 50కి పైగా వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట భగత్‌సింగ్ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) పార్టీ 153వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం న్యూడెమోక్రసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకావిష్కరణ చేసి అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజలకు భూమి, భుక్తి, విముక్తి సాధ్యం కాదని చెపుతూ ప్రజల విముక్తి కోసం వీరోచితంగా పోరాడి అసువులు బాసిన అమర వీర యోధుడు కామ్రేడ్ లెనిన్ త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఐ.కృష్ణ, మేర్గు చంద్రయ్య, కోడిపుంజుల జ్యోతి, వేల్పుల సాంబయ్య, ఉప్పులేటి నర్సయ్య, బొంతు ఆనంద్, రాజకొమురయ్య, తిరుపతి, దేవి శంకర్, కరుణాకర్ తదితరులున్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు